www.prajasakti.com

ప్రజాశక్తి

బుధవారం 1 అక్టోబర్ 2025

5

తిరుపతి



ఎంపీ గురుమూర్తి ప్రశ్నకు కేంద్ర మంత్రి వివరణ

ప్రజాశక్తి - తిరుపతి టౌన్: అంగన్వాడీ వర్కర్లు, ఏఎన్ఎంలు, ఆశా వర్కర్లు, అలాగే సెర్ప్, మెప్మా పథకాలలో పనిచేస్తున్న రిసోర్స్ పర్సన్స్ సమస్యలను తిరుపతి ఎంపీ మద్దిల గురుమూర్తి ఫిబ్రవరిలో జరిగిన పార్లమెంట్ సమావేశాల్లో ప్రస్తావించగా, మంగళ వారం కేంద్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ సహాయ మంత్రి ప్రతాప్ రావ్ జాధవ్ సమాధానమిచ్చారు. ఆయన తెలిపిన వివరాల మేరకు అంగన్వాడీ కార్యకర్తలకు రూ.4,500, సహాయకులకు రూ.2,250 గౌరవ వేతనం, కార్యకర్తలకు రూ.500, సహాయకులకు రూ.250 ప్రోత్సాహకం అందిస్తున్నట్లు తెలిపారు. సూపర్వైజర్, అంగన్వాడీ కార్యకర్తల పోస్టుల్లో 50 శాతం అంగన్వాడీ సహాయకులను పదోన్నతుల ద్వారా భర్తీ చేయాలని రాష్ట్రాలకు సూచించారు. జీవిత బీమా, ప్రమాద బీమా, పెన్షన్ పథకాలిస్తున్నట్లు తెలిపారు. 20 రోజుల సాధారణ, 45 రోజులు గర్భస్రావానికి, 180 రోజుల ప్రసూతి సెలవు, రెండు సెట్ల యూనిఫాంలు కూడా అందజేస్తున్నారని, రాష్ట్ర ప్రభుత్వ పరిధిలో వారికి ప్రోత్సాహకాలు అందించాలని సూచించామని తెలిపారు.

సూర్యప్రభ, చంద్ర ప్రభలపై శ్రీహరి చిద్విలాసం

సూర్యప్రభ వాహనం

చంద్రప్రభ వాహనం

ప్రజాశక్తి - తిరుమల: తిరుమల శ్రీవారి సాలకట్ల బ్రహ్మోత్సవాల్లో భాగంగా 7వ రోజు మంగళవారం ఉదయం 8 గంటలకు స్వామివారు బద్రి నారాయణుడి అలంకారంలో సూర్యప్రభ వాహనంపై భక్తులకు దర్శనమిచ్చారు. వాహనం ముందు భక్తజన బృందాల చెక్కభజనలు, కోలాటాలతో స్వామివారిని కీర్తిస్తుండగా, మంగళవాయిద్యాల నడుమ స్వామివారి వాహనసేవ కోలాహలంగా జరిగింది. భక్తులు అడుగడుగునా కర్పూరహారతులు సమర్పించి స్వామివారిని దర్శించుకున్నారు. రాత్రి 7 గంటలకు చంద్రప్రభ వాహనంపై శ్రీమలయప్పస్వామి దర్శనమిచ్చారు. వాహన సేవలో తిరుమల పెద్దజీయర్‌స్వామి, చిన్నజీయర్‌స్వామి, టీటీడీ చైర్మన్ బీ.ఆర్.నాయుడు, ఈవో అనిల్ కుమార్ సింఘాల్, జేఈవో వి.వీరబ్రహ్మం, సివిఎస్వో కె.వి. మురళీకృష్ణ, అధికారులు పాల్గొన్నారు. బ్రహ్మోత్సవాల్లో ఎనిమిదో రోజైన బుధవారం ఉదయం 7 గంటలకు స్వామివారి రథోత్సవం జరుగనుంది.

శోభాయమానంగా స్నపన తిరుమంజనం

మంగళవారం శ్రీవారి ఆలయంలో పవిత్రాలు, డ్రైఫ్రూట్లు, రోజామాలల అలంకారంతో స్నపన తిరుమంజనం శోభాయమానంగా నిర్వహించారు. ఆలయంలోని రంగనాయకుల మండపంలో జరిగిన ఈ కార్యక్రమంలో వివిధ రకాల ఫలాలు, పుష్పాలతో స్వామి, అమ్మవార్ల ఉత్సవమూర్తులను అందంగా అలంకరించారు. నీలి పవిత్రాలు, లవంగాలు, వట్టివేరు, తులసి, డ్రైఫ్రూట్లు, రోజామాలలతో శ్రీదేవి, భూదేవి సమేత శ్రీమలయప్పస్వామివారి ఉత్సవమూర్తులను అలంకరించారు.



స్నపన తిరుమంజనం

అన్నప్రసాదాల పంపిణీపై భక్తుల్లో సంతృప్తి

బ్రహ్మోత్సవాల్లో అన్న ప్రసాదాల పంపిణీపై 99 శాతం మంది భక్తులు సంతృప్తి వ్యక్తం చేశారని టీటీడీ అన్నప్రసాద విభాగం డిప్యూటీ ఈవో ఎం.రాజేంద్ర కుమార్ తెలిపారు. తిరుమలలోని రామ్ భగీచా - 2లో ఏర్పాటు చేసిన మీడియా సెంటర్‌లో అన్న ప్రసాద విభాగం ప్రత్యేక అధికారి జీ ఎల్ ఎన్ శాస్త్రితో కలిసి ఆయన మంగళవారం మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ భక్తులకు నాణ్యమైన అన్నప్రసాదం, అల్పాహారం, పాలు, మజ్జిగ భక్తులకు పంపిణీ చేస్తున్నట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో టీటీడీ సీపీఆర్వో డాక్టర్ టి.రవి పాల్గొన్నారు.

గరుడ సేవ విజయవంతం

శ్రీవారి సేవకుల అపూర్వమైన సేవలు గరుడసేవను విజయవంతం చేశాయని టీటీడీ చీఫ్ పిఆర్వో డాక్టర్ టి.రవి తెలిపారు. తిరుమలలోని రామ్ భగీచ -2 లో ఏర్పాటు చేసిన మీడియా సెంటర్‌లో మంగళవారం ఆయన మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఈ సంవత్సరం వార్షిక బ్రహ్మోత్సవాల్లో 3500 మంది శ్రీవారి సేవకులు, 400 మంది పరాకమణి సేవకులు, 100 మంది గ్రూప్ సూపర్వైజర్లు ఆన్‌లైన్‌లో బుకింగ్ చేసుకుని శ్రీవారి సేవకు విచ్చేశారని చెప్పారు. గరుడసేవ రోజున నాలుగు మాడ వీధుల్లో సుమారు 2000 మంది సేవకులను ప్రత్యేకంగా నియమించామని ఆయన తెలిపారు. ఈ సమావేశంలో టీటీడీ పిఆర్వో కుమారి పి.నీలిమ కూడా ఉన్నారు.

పారిశుద్ధ్యానికి పెద్దపీట

బ్రహ్మోత్సవాల్లో పారిశుద్ధ్యానికి పెద్దపీట వేసినట్లు టీటీడీ ఆరోగ్య విభాగం డిప్యూటీ ఈవో సోమన్నారాయణ, మధుసూదన్ రావు తెలిపారు. తిరుమలలోని రామ్ భగీచా - 2లో ఏర్పాటు చేసిన మీడియా సెంటర్‌లో ఆయన మంగళవారం ఆరోగ్య విభాగంపై మీడియా సమావేశం నిర్వహించారు. తిరుమలలో పారిశుద్ధ్యం లోపించకుండా ముందస్తు ప్రణాళికలు రూపొందించుకుని అమలు చేసినట్లు చెప్పారు. ఎప్పటికప్పుడు మరుగుదొడ్లను శుభ్రం చేసేందుకు స్టాండర్డ్ ఆపరేటింగ్ ప్రొసీజర్‌ను రూపొందించుకుని విజయవంతంగా అమలు చేశామని తెలిపారు.

మహిళలపై అఘాయిత్యాలను అరికట్టాలి

- సూపర్ సిక్స్ పథకాలు అందరికీ అందచేయాలి
- ఐద్వా రాష్ట్ర ఉపాధ్యక్షురాలు మస్తాన్ బి

ప్రజాశక్తి - తిరుపతి టౌన్: అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం (ఐద్వా) జిల్లా మహాసభ తిరుపతిలోని యుటిఎఫ్ కార్యాలయంలో మంగళవారం జరిగింది. ఈ సభలకు ముఖ్యఅతిథిగా రాష్ట్ర ఉపాధ్యక్షులు మస్తాన్ బి పాల్గొన్నారు. ఆమె మాట్లాడుతూ మహిళలపై అత్యాచారాలు, హింస పెరిగిపోతున్నాయని, వీటిని కట్టడి చేయడంలో ప్రభుత్వాలు విఫలమయ్యాయన్నారు. కూటమి ప్రభుత్వం ఎన్నికల హామీలు నిలబెట్టుకోవాలని, సూపర్ సిక్స్‌లో భాగంగా మహిళలకు నెలకు 1500 రూపాయలు పథకం ఊసే లేదన్నారు. ఉచిత గ్యాస్ సిలిండర్లు నామమాత్రంగా కొద్దిమందికి మాత్రమే వస్తున్నాయన్నారు. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం కొన్ని బస్సులకు మాత్రమే పరిమితమయిందన్నారు. ఎన్నికల హామీలు ఆంక్షలు లేకుండా అమలు చేయాలని డిమాండ్ చేశారు. మహిళలకు 12 గంటల పని విధానాన్ని ఆమోదిస్తూ అసెంబ్లీలో తీర్మానం చేయడం దుర్మార్గమని, మహిళలు అనారోగ్యం పాలవుతారని ఈ తీర్మానాన్ని విరమించుకోవాలన్నారు. మైక్రో ఫైనాన్స్‌ల వేధింపులకు అనేకమంది మహిళలు ఆత్మహత్యలకు పాల్పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. పొదుపు సంఘాల్లోని మహిళలకి ఉపాధి కల్పించి ఆదుకోవాలని కోరారు. ఈ మహాసభకు అధ్యక్ష వర్గంగా ఎం.జయంతి, ఈశ్వరి, రాధమ్మ వ్యవహరించగా, జిల్లా కార్యదర్శి పి సాయి లక్ష్మి, నాయకులు సత్య శ్రీ, సుజాతమ్మ , చంద్రకళ, నాగమణి, లక్ష్మి తదితరులు పాల్గొని ప్రసంగించారు.

విద్యార్థులు సమాజ హితానికి పాటుపడాలి

ప్రజాశక్తి - తిరుపతి టౌన్: ఎస్ఎఫ్ఐ 25వ మహాసభ ఆహ్వాన సంఘం ఏర్పాటు సమావేశం వేమన విజ్ఞాన కేంద్రంలో మంగళవారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొని రిజిస్ట్రార్ భూపతి నాయుడు పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ విద్యార్థుల మంచి కోసం విద్యార్థి సంఘాలు పని చేయాలన్నారు. తాను విద్యార్థిగా ఉన్నపుడు విద్యార్థి నాయకుడిగా గెలిచానని గుర్తు చేసుకున్నారు. ఎస్ఎఫ్ఐ నాయకులు యూనివర్సిటీ విద్యార్థుల సమస్యలపై పోరాడు తున్నారని, రాత్రి 10 గంటల వరకు అయినా సరే కూర్చొని చర్చించి విద్యార్థి సమస్యలు పరిష్కరిస్తానన్నారు. ఎస్ఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శిలు రాంమోహన్, ప్రసన్న కుమార్‌లు మాట్లాడుతూ ఎస్ఎఫ్ఐ రాష్ట్ర మహాసభలకు తిరుపతిలో అతిధ్యం ఇవ్వడమంటే విద్యార్థుల హక్కులు, ఉద్యమాలకు సహకరించడమేనన్నారు. టెంకాయలు దామోదరం మాట్లాడుతూ ర్యాగింగ్ సంస్కృతికి వ్యతిరేకంగా చైతన్యం కల్గించాలన్నారు. అపుస్మా ప్రైవేట్ విద్యా సంస్థల సీనియర్ నాయకులు విశ్వ నాథ్ రెడ్డి మాట్లాతూ అందరికీ విద్య కోసం పోరాడే విద్యార్థి సంఘాలు అవసరమన్నారు. మాజీ ఎస్ఎఫ్ఐ రాష్ట్ర ఉపాధ్యక్షులు, వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు భగవాన్ నాగరాజు మాట్లాడుతూ ప్రజాస్వామ్యం కోసం పోరాడిన చరిత్ర, మంచి నాయకులని అందించిన ఘనత ఎస్ఎఫ్ఐకి ఉందని, అలాంటి సంఘం మహాసభలు తిరుపతిలో జరగడం శుభపరిణామమన్నరు. అనంతరం మహాసభ ఆహ్వాన సంఘం కమిటీ ఏర్పాటు చేశారు. మహాసభ ఆహ్వాన సంఘం గౌరవ అధ్యక్షులుగా టెంకాయల దామోదరం, అధ్యక్షులుగా ప్రొఫెసర్ పీసీ వెంకటేశ్వర్లు, ప్రధాన కార్యదర్శిగా భగత్ రవి, కోశాధికారిగా అక్బర్, గౌరవ సలహాదారులుగా విశ్వనాధ్ రెడ్డి, తిప్పరెడ్డి చీఫ్ ప్యాట్రిన్స్‌గా అప్స రాష్ట్ర అధ్యక్షులు సుబ్రహ్మణ్యం రాజులను ఎంపిక చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షులు వినోద్, అశోక్, వీరేష్, యూనివర్సిటీ నాయకులు నరసన్న తదితరులు పాల్గొన్నారు.

తిరుపతి బయోట్రిమ్‌లో ఎంట్రప్రెన్యూర్స్ వర్క్ షాప్

ఔత్సాహికులకు ప్రశంసా పత్రాలను, జ్ఞాపికలను అందిస్తున్న దృశ్యం

ప్రజాశక్తి - తిరుపతి (మంగళం): తిరుపతి-కరకంబాడి మార్గంలోని అటవీ శాఖకు చెందిన బయోట్రిమ్‌లో ఆంధ్రప్రదేశ్ ఎంఎస్ఎంఈ డెవలప్మెంట్ కార్పొరేషన్ వారి ఆధ్వర్యంలో క్లౌడ్ టీం ఆర్గనైజేషన్ సహకారంతో ఎంట్రప్రెన్యూర్స్ కోసం ఇంటలెక్చువల్ ప్రాపర్టీ అండ్ రైట్స్‌పై వర్క్ షాపు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా డిఆర్డిఏ విభాగం ప్రాజెక్టు డైరెక్టర్ శోభన్ బాబు, కడప ఏపీఎఫ్పిఎస్ఈడి సతీష్, డిఐసి ఐపిఓ హరికృష్ణ, కెవిఐబి ఏడి వెంకటరావు, సెట్ విన్ సిఈఓ మురళికృష్ణ, డిఆర్పి ప్రసాద్, యూనియన్ బ్యాంక్ మేనేజర్ ప్రసాద్, కెఎల్ యూ డైరెక్టర్ ఆఫ్ ఇన్నోవేషన్ కెఆర్ రావు, విట్ యూనివర్సిటీ ప్రొఫెసర్ డాక్టర్ జానకిరామయ్య, క్లౌడ్ టీం ఆర్గనైజేషన్ డైరెక్టర్ ఆర్ఎస్ రామిరెడ్డి పాల్గొన్నారు. తిరుపతి, చిత్తూరు, కడప, నెల్లూరు జిల్లాల నుండి అనేక మంది ఎంట్రప్రెన్యూర్స్ ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ వర్క్ షాప్ లో పాల్గొన్న ఔత్సాహితులకు ప్రశంసా పత్రాలను, జ్ఞాపికలను అందించారు.

ఈ పాపం ఎవరిది ?

ప్రజాశక్తి - వరదయ్యపాలెం : పురిటి బిడ్డను ఇసుకలో పూడ్చిన ఘటనలో నవజాత శిశువు మృతి చెందిన విషయం తెలిసిందే. ఈ ఘటనపై విచారణలో భాగంగా నాగలాపురం ఎస్ఐ సునీల్ వరదయ్యపాలెం బస్టాండ్ నుండి పాపను పూడ్చిపెట్టిన ప్రదేశం వరకు ఉన్న దుకాణ సముదాయంలో గల సీసీ కెమెరాలను పరిశీలించారు. ఇందులో అనుమానాస్పదంగా తిరుగుతున్న ఓ మహిళను గుర్తించి, ఆమె వద్ద ఉన్న బ్యాగులో సోదా చేయగా కొన్ని విటమిన్ మాత్రలు, ఓఆర్ఎస్ జ్యూస్ దొరకడంతో అనుమానం వచ్చి, స్థానిక ప్రభుత్వాసుపత్రిలో ఆమెకి పరీక్షలు నిర్వహించి, ఆమెను కుటుంబ సభ్యులకు అప్పజెప్పారు. అయితే ఆమెపై అనుమానం మాత్రమేనని ఇంకా ఎటువంటి నిజ నిర్ధారణ జరగలేదని ఎస్ఐ తెలిపారు. డిఎన్ఏ టెస్ట్ చేయటానికి ఆమె సహకరించడం లేదని, ఈ కేసుపై దర్యాప్తు కొనసాగుతుందని త్వరలోనే నిందితులను గుర్తిస్తామని తెలిపారు.

నిద్రపోతున్న నిఘా వ్యవస్థ

మండలంలో ఇంత సంచలనం కలిగించే విషయం జరిగితే కనీసం ఎలా జరిగిందో తెలుసుకునే ప్రయత్నంలో భాగంగా పోలీస్ శాఖ వారు ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలు పరిశీలించడానికి కూడా అవకాశం లేకుండా పోయింది. గత కొన్ని నెలలుగా వరదయ్యపాలెం ఉన్న సీసీ కెమెరాలు పాడైపోవడంతో మరమ్మతులు చేయించే ప్రయత్నం పోలీస్ శాఖ వారు చేయలేదు. అవాంఛనీయ సంఘటనలు జరిగినప్పుడు నామమాత్రపు దర్యాప్తు చేసి చేతులు దులుపుకుంటున్నారు. ఇలాంటి పరిస్థితుల్లో ఇంకేదైనా పెద్ద సమస్యలు సంభవిస్తే పరిస్థితి ఏమిటని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇంతటి దారుణానికి ఒడిగట్టిన మహిళ వెనుక ఉన్న కారణాల ను తెలుసుకొని శిక్షించాలని, అలాగే సీసీ కెమెరాల మరమ్మతులను తక్షణమే చేపట్టాలని కోరుతున్నారు.

నవజాత శిశువును ఇసుకలో పూడ్చి పెట్టిన కేసులో దర్యాప్తు చేస్తున్న పోలీసులు

పోలేరమ్మకు పట్టువస్త్రాలు సమర్పించిన ఎమ్మెల్యే

శ్రీశ్రీ పోలేరమ్మకు సారె తీసుకెళుతన్న ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ

ప్రజాశక్తి - నాయుడుపేట: దసరా శరవన్నవ రాత్రి ఉత్సవాలు సందర్భంగా సూళ్లూరుపేట ఎమ్మెల్యే దంపతులు మంగళవారం నాయుడుపేట గ్రామదేవత శ్రీ శ్రీ పోలేరమ్మకు పట్టు వస్త్రాలు సమర్పించి, ప్రత్యేక పూజలు నిర్వహించారు. సూళ్లూరుపేట నియోజకవర్గ ఎమ్మెల్యే డాక్టర్ నెలవల విజయశ్రీ, పార్థసారథి దంపతులు, మాజీ ఎంపీ నెలవల సుబ్రహ్మణ్యం, అమృత సరళ దంపతులు పోలేరమ్మకు పట్టు వస్త్రాలను సమర్పించి, మొక్కులు తీర్చుకున్నారు. అనంతరం పూజారులు అమ్మవారికి పూజలు చేసి ఉభయ దాతలైనా ఎమ్మెల్యే దంపతులను నెలవల సుబ్రహ్మణ్యం దంపతులను ఆశీర్వదించి తీర్థప్రసాదాలు అందజేశారు. ఈ సందర్భంగా పలువురు టీడీపీ నాయకులు ఎమ్మెల్యే నెలవల విజయ శ్రీ, పార్థసారథి దంపతులకు శాలువాలు కప్పి ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో శ్రీ పోలేరమ్మ ఆలయ కమిటీ చైర్మన్ నానబాల సుబ్బారావు, నాయుడుపేట మున్సిపల్ వైస్ చైర్మన్ షేక్ రఫీ, టీడీపీ నాయకులు కట్టా వెంకటరమణారెడ్డి, పలుకూరు ముత్యాలయ్య, పోట్లపూడి రాజేష్, పెసల కిషోర్ బాబు, అవధానం సుధీర్, పలువురు నాయకులు పాల్గొన్నారు.

శ్రీసిటీ పరిశ్రమల్లో ఆయుధ పూజ

ప్రజాశక్తి - వరదయ్యపాలెం: శ్రీసిటీలోని పలు పరిశ్రమలు మంగళవారం ఆయుధ పూజ నిర్వహిం చుకున్నాయి. కంపెనీల ఉత్పత్తికి వినియోగించే పనిముట్లు, యంత్రాలు, వాహనాలను అలంక రించి పూజలు నిర్వహించారు. పరిశ్రమలను పువ్వులు, ముగ్గులతో కొత్త కాంతులీనేలా తీర్చిదిద్దా రు. కార్మికులు భద్రత, శ్రేయస్సును కాంక్షిస్తూ భక్తిశ్రద్ధలతో ఆయుధపూజను నిర్వహించారు.

ధర్నా పోస్టర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి - తిరుపతి సిటీ: ఫ్యాప్టో 7తేదీన నిర్వహించనున్న ధర్నా పోస్టర్లు మంగళవారం ఆవిష్కరించారు. తిరుపతి జిల్లా ఫ్యాప్టో సన్నాహ సమావేశం ఎస్టీయూ భవన్లో తిరుపతి జిల్లా ఫ్యాప్టో చైర్మన్ సురేష్ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సమావేశానికి రాష్ట్ర పరిశీలకులుగా రాష్ట్ర ఫ్యాప్టో కార్యవర్గ సభ్యులు సి.రమేష్ విచ్చేసి ఉద్యోగ ఉపాధ్యాయ సమస్యలను వివరించారు. ఈ కార్యక్రమంలో సెక్రెటరీ జనరల్ వెంకట్రావు, మురళీకృష్ణ, రామ చంద్రయ్య, జగన్నాథం, బాలసుబ్రమణ్యం, ముత్యాలరెడ్డి, లక్ష్మ య్య, వాసు, రవీంద్ర, సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.

తిరుపతి ⟷ రాజమండ్రి @1499

- ఆ విమానంలో ఛార్జి రూ.1499
- నేడు తిరుపతికి కొత్త విమాన సర్వీస్
- రాజమండ్రి - తిరుపతి మధ్య రాకపోకలు
- అలయన్స్ ఎయిర్ లైన్స్ దసరా కానుక

ప్రజాశక్తి - తిరుపతి బ్యూరో : తిరుమల శ్రీవారి భక్తులకు మరో విమాన సర్వీస్ అందుబాటులో రానుంది. అలయన్స్ ఎయిర్ లైన్ సంస్థ దసరా పండుగ పురస్కరించుకుని రాజమండ్రి - తిరుపతి మధ్య నడిచే ఈ సర్వీస్‌ను కేంద్ర విమానయాన శాఖ మంత్రి కే.రాంమోహన్ నాయిడు బుధవారం రాజమండ్రిలో ప్రారంభించనున్నారు. ప్రయాణికులు ఆకర్షించేందుకు అలయన్స్ ఎయిర్ లైన్ సంస్థ రాజమండ్రి తిరుపతి మధ్య టికెట్ ధర1499 రూపాయలుగా నిర్ణయించింది.

తిరుమల శ్రీవారి భక్తుల సౌకర్యం కోసం మరో విమాన సర్వీసును అందుబాటులోకి తీసుకువస్తూ శుభవార్త చెప్పింది. అక్టోబర్ ఒకటవ తేదీ నుండి రాజమహేంద్రవరం తిరుపతి మధ్య ఈ కొత్త విమాన సర్వీస్ ప్రారంభమవుతుంది. ఈ సందర్భంగా అలయన్స్ ఎయిర్ లైన్స్ ప్రయాణికులకు అద్భుతమైన ఆఫర్‌ను ప్రకటించింది. అక్టోబర్ 2,4,6 తేదీల్లో తిరుపతి నుండి రాజమహేంద్రవరం విమాన టికెట్ ధర కేవలం 1499 రూపాయలుగా నిర్ణయించారు. అంతకుముందు ఈ టికెట్ ధర 1999 రూపాయలుగా ఉండగా, తిరుమలకు వెళ్లే భక్తులను ఆకర్షించాలనే లక్ష్యంతో ఈ టికెట్ ధరలు తగ్గించినట్లు అలయన్స్ విమాన సంస్థ రాజమహేంద్రవరం మేనేజర్ వెల్లడించారు. 1499 రూపాయలకే విమానంలో ప్రయాణం చేసి తిరుమల శ్రీవారిని దర్శించుకోవచ్చని, ఈ అవకాశాన్ని ప్రతి ఒక్కరు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

తిరుపతికి కొత్త సర్వీస్‌పై శుభవార్త చెప్పిన కేంద్రమంత్రి

తిరుమల శ్రీవారిని దర్శించుకోవడానికి భక్తులకు ఇది చాలా సౌకర్యవంతమైన, సుఖవంతమైన ప్రయాణాన్ని అందిస్తుందని, తక్కువ సమయంలో, తక్కువ ఖర్చుతో శ్రీవారిని దర్శించుకోవచ్చని అలయన్స్ ఎయిర్ లైన్స్ చెబుతోంది. ఇక అక్టోబర్ ఒకటవ తేదీ నుంచి రాజమహేంద్రవరం తిరుపతి మధ్య అలయన్స్ ఎయిర్ లైన్స్ విమానాలు వారంలో మూడు రోజులు నడుస్తాయని కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి రామ్మోహన్ నాయుడు ఈ కొత్త సర్వీస్ పైన శుభవార్త చెప్పారు.

వారంలో మూడు రోజులు..

మొదటి రోజు అక్టోబర్ ఒకటవ తేదీ ఉదయం 9 గంటల 25 నిమిషాలకు తిరుపతి నుంచి బయలుదేరి విమానం రాజమహేంద్రవరంకు చేరుకుంటుందని, మళ్లీ తిరుగు ప్రయాణం 10 గంటల 15 నిమిషాలకు ప్రారంభమవుతుందని మంత్రి తెలిపారు. అక్టోబర్ రెండవ తేదీ నుంచి ఈ సర్వీసులు ప్రతి మంగళవారం, గురువారం, శనివారం అందుబాటులో ఉంటాయన్నారు.

విమాన సర్వీసుల సమయాలు..

మంగళవారం, గురువారం, శనివారం రోజుల్లో ఉదయం 7 గంటల 40 నిమిషాలకు తిరుపతి నుంచి బయలుదేరి విమానం ఉదయం 9 గంటల 25 నిమిషాలకు రాజమహేంద్రవరం చేరుకుంటుందని అలయన్స్ విమాన సంస్థ మేనేజర్ పేర్కొన్నారు. తిరుగు ప్రయాణంలో రాజమహేంద్రవరం నుంచి ఉదయం 9 గంటల 50 నిమిషాలకు బయలుదేరి, ఉదయం 11 గంటల 20 నిమిషాలకు తిరుపతి చేరుకుంటుందని తెలిపారు.

ఏపీడీకేఎస్ జిల్లా కమిటీ ఎంపిక

అధ్యక్ష కార్యదర్శులుగా రఘు, సంక్రాంతి వెంకటయ్య

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి : ఆంధ్రప్రదేశ్ డప్పు కళాకారుల సంఘం తిరుపతి జిల్లా నూతన కమిటీని మంగళవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. స్థానిక మహేష్ కళ్యాణ మండపంలో ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షులు ఎండీ ఆనందబాబు అధ్యక్షతన జిల్లా కమిటీ ఎంపిక జరిగింది. అధ్యక్షులుగా డి.రఘు, కార్యదర్శిగా సంక్రాంతి వెంకటయ్య, గౌరవ అధ్యక్షులుగా అంగేరి పుల్లయ్య, ఉపాధ్యక్షులుగా పెంచలయ్య, టి.గురవయ్య, సహాయ కార్యదర్శులుగా ఆదిబాబు, అక్బర్ బాషా, కోశాధికారిగా రెడ్డిపల్లి సురేష్ నియమితులయ్యారు. ఆదేవిధంగా కమిటీ సభ్యులుగా ప్రభాకర్, ముత్తు గోవిందస్వామి, వెంకటముని శ్రీనివాసులు, బాలగు రవయ్య, సుబ్బరామయ్య, కె శ్రీనివాసులు, నారాయణ, గురవయ్య, ఆరుల్, కో-ఆప్షన్ సభ్యులుగా మునిశేఖర్, టి. నారాయణలు నియమితులయ్యారు. డప్పు కళాకారుల సమస్యలు, డిమాండ్ల సాధన కోసం నూతన కమిటీ అవిశ్రాంతంగా పోరాడుతుందని అధ్యక్ష, కార్యదర్శులు పేర్కొన్నారు.

రాజ్యాంగ పరిరక్షణ పాదయాత్ర

ప్రజాశక్తి - తిరుపతి సిటీ: తిరుపతిలో మంగళవారం రాజ్యాంగ పరిరక్షణ పాదయాత్ర నిర్వహించారు. రాష్ట్ర వ్యాప్త దళిత సంఘాల నాయకులు ఈ కార్యక్రమానికి హాజరయ్యారు. బాలాజీ కాలనీ, పూలే విగ్రహం నుంచి ఆర్టీసీ బస్టాండ్ వద్ద ఉన్న అంబేద్కర్ విగ్రహం వరకు పాదయాత్ర సాగింది. ఈ సందర్భంగా కేంద్ర మాజీ మంత్రి డాక్టర్ చింతామోహన్ మాట్లాడుతూ భారత దేశం ఈ స్థాయికి వచ్చిందంటే, అంబేద్కర్ రాసిన భారత రాజ్యాంగం, కాంగ్రెస్ పార్టీయే కారణమన్నారు. ఈ నెల 3న కుప్పంలో రాజ్యాంగ పరిరక్షణ పాదయాత్ర మొదలైందని తెలిపారు. దళితులను విభజిస్తే, రాష్ట్రం రెండు ముక్కలైనట్లు, దేశం కూడా రెండు ముక్కలవుతుందన్నారు. దళిత విభజనతో మోదీ, చంద్రబాబు చిక్కుల్లో పడ్డారన్నారు. రాజ్యాంగ పరిరక్షణ పాదయాత్రలో కళాకారుల సత్య, ధర్మయంతి, వారి బృందం పాడిన పాటలు అందరిని ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో ఎస్సీ ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు అశోక్ బాబు, మాల మహానాడు రాష్ట్ర అధ్యక్షులు యమలా సుదర్శన్ తదితరులు పాల్గొన్నారు.

ర్యాగింగ్ కాదు.. విద్యార్థుల మధ్య వివాదం

ప్రజాశక్తి - తిరుపతి సిటీ: సోషల్ మీడియాలో ఇటీవల ఒక వీడియో వైరల్ అవుతోంది. ఇందులో సిద్ధార్థ ఇంజనీరింగ్ కళాశాల హాస్టల్లో ఆరుగురు సీనియర్ విద్యార్థులు ఒక జూనియర్ విద్యార్థిపై దాడి చేసిన ఘటనగా ప్రచారం జరుగుతోందని తిరుపతి జిల్లా ఎస్పీ కార్యాలయం పీఆర్ఓ ఒక ప్రకటనలో తెలిపారు. ఆయన వాస్తవాన్ని మీడియాకు వివరించారు. 20 తేదీన హాస్టల్ ప్రాంగణంలో ఒక విద్యార్థి విషయంలో విద్యార్థుల మధ్య వివాదం చెలరేగి దాడి జరిగిందని తెలిపారు. పోలీసులు ఈ ఘటనలో పాల్గొన్న విద్యార్థులను గుర్తించి, నారాయణవనం పోలీస్ స్టేషన్లో వారిపై కేసు నమోదు చేశారన్నారు. వారు ఆరుగురు పాలిటెక్నిక్ విద్యార్థులు (అందరూ మైనర్లు)గా గుర్తించామన్నారు. వారిపై చట్టపరమైన చర్యలు ప్రారంభించినట్లు తెలిపారు. ఆ విద్యార్థులను కళాశాల యాజమాన్యం సస్పెండ్ చేసిందన్నారు. ర్యాగింగ్ లేదా హింసాత్మక ఘటనలపై పోలీసులకు ఫిర్యాదు చేయాలని కాలేజీ యాజమాన్యాలు, తల్లిదండ్రులకు సూచించారు.

రేపు స్విమ్స్ ఓపీకి సెలవు

ప్రజాశక్తి తిరుపతి సిటీ : దసరా పండగను పురస్కరించుకొని అక్టోబర్ రెండవ తేదీ స్విమ్స్ ఓపీకి సెలవు ప్రకటిస్తున్నట్లు డైరెక్టర్ డాక్టర్ ఆర్వీ కుమార్ తెలిపారు. దసరా సందర్భంగా స్విమ్స్ ఓపీ, ఆపరేషన్ థియేటర్లకు (ఓటి) సెలవు, ఈ విషయాన్ని గమనించి రోగులు, వారి సహాయకులు సహకరించాలని కోరారు.

తిరుపతిలో యువి స్పేస్ స్టేషన్ ప్రారంభం

ప్రజాశక్తి - తిరుపతి సిటీ: అల్ట్రా వయొలెట్ తమ జాతీయ కార్యకలాపాలను విస్తరించి, దేశవ్యాప్తంగా 26 నగరాల్లో తమ కార్యకలాపాలను మరింత బలోపేతం చేస్తోంది. అందులో భాగంగా తిరుపతిలో యువి స్పేస్ స్టేషన్ను ప్రారంభించినట్లు ఆ సంస్థ సీనియర్ వైస్ ప్రెసిడెంట్ గణనన్ తెలిపారు. రేణిగుంట రోడ్డులో నూతనంగా ఏర్పాటు చేసిన యువి స్పేస్ స్టేషన్ ప్రారంభించిన ఆయన మాట్లాడుతూ డీలర్ ఎస్ఎస్ ఆటోతో భాగస్వామ్యం చేసుకుని ప్రారంభించిన యువి స్పేస్ స్టేషన్, వినియోగదారులకు అల్ట్రావయొలెట్ మోటార్ సైకిళ్లు, ఎఫ్-47, ఎఫ్77 మ్యాక్ 2, ఎఫ్ 77 సూపర్ స్ట్రీట్ లను ప్రత్యక్షంగా వీక్షించటానికి, సమగ్ర అనుభవాన్ని పొందటానికి సహాయపడుతుందన్నారు. మోటార్ సైకిళ్ల వివిధ అత్యాధునిక ఫీచర్లను వివరించారు. తిరుపతిలో నూతన షోరూం ప్రారంభం సందర్భంగా 2 లక్షల 74 వేల రూపాయల విలువ గల ఈ బైక్ను 2,49,000కు అందిస్తున్నామన్నారు. ఈ అవకాశాన్ని తిరుపతివాసులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆ సంస్థ డీలర్ ప్రిన్సిపల్ సుధాకర్. ఎస్, ఆ సంస్థ ప్రతినిధులు పలువురు ప్రముఖులు పాల్గొన్నారు.

కార్మికుల సమస్యలు పరిష్కరిస్తాం : ఎమ్మెల్యే

ప్రజాశక్తి - తిరుపతి సిటీ: విద్యుత్ యూనియన్ కార్మికుల సమస్యల పరిష్కారానికి తన వంతు కృషి చేస్తానని తిరుపతి ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు తెలిపారు. ఏ.పీ. స్టేట్ జాయింట్ విద్యుత్ ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు తోకల అశోక్ కుమార్ను ఎమ్మెల్యే మంగళవారం మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. ఈ సందర్భంగా యూనియన్ కార్మికుల సమస్యల పరిష్కారానికి తాను ఎల్లప్పుడూ సహకారం అందిస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కోశాధికారి ఎస్.పవన్ కుమార్, జాయింట్ సెక్రెటరీ బి.వెంకటప్ప, డిస్కం కార్యదర్శి రాష్ట్ర మల్లికార్జున, డిస్కం కోశాధికారి సోమశేఖర్, రాష్ట్ర కాంట్రాక్టు కార్మికుల కార్యదర్శి బంగారు వెంకటేష్, డిస్కం అధ్యక్షులు రామా నాయుడు ధర్మేంద్ర, కార్యదర్శి ఎస్. కిరణ్ కుమార్, యూనియన్ సభ్యులు హర్షవర్ధన్ సాయి తదితరులు పాల్గొన్నారు.

వైసీపీ డిజిటల్ బుక్ ఆవిష్కరణ



ప్రజాశక్తి - గూడూరు టౌన్: కార్యకర్తల శ్రేయస్సునుద్దేశించి వైసీపీ డిజిటల్ బుక్ క్యూ ఆర్ కోడ్ ను తీసుకొచ్చినట్లు వైసీపీ నాయకులు పేర్కొన్నారు. గూడూరు పట్టణ, రూరల్ కు సంబంధించి వైసీపీ డిజిటల్ బుక్ క్యూఆర్ కోడ్ ని గూడూరు నియోజకవర్గ వైసీపీ పార్టీ కార్యాలయంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వైసీపీ నాయకులు మాట్లాడుతూ డిజిటల్ బుక్ క్యూ ఆర్ కోడ్ ను కార్యకర్తలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈకార్యక్రమంలో గూడూరు పట్టణ అధ్యక్షులు బొమ్మిడి శ్రీనివాసులు, గూడూరు రూరల్ పార్టీ అధ్యక్షులు మల్లు విజయ్ కుమార్ రెడ్డి, పట్టణ, రూరల్ వైసీపీ నాయకులు మండి శ్రీనివాసులు రెడ్డి, భీమవరపు శ్రీనివాసులు రెడ్డి, సుజన రెడ్డి, సుఖన్, పూర్ణ చంద్ర, దయాకర్ తదితరులు పాల్గొన్నారు.

అంగన్వాడీ పోస్టులకు దరఖాస్తు చేసుకోండి

ప్రజాశక్తి -ఏర్పేడు : రేణిగుంట ఐసిడిఎస్ ప్రాజెక్ట్ పరిధిలో ఏర్పేడు మండలంలో ఖాళీగా ఉన్న అంగన్వాడి పోస్టుల భర్తీకి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామని సిడిపిఓ కే.పృథ్వీలత తెలిపారు. పాపానాయుడుపేట అంగన్వాడి కార్యకర్త పోస్ట్(ఎస్టీ), మునగలపాలెం సహాయకురాలు పోస్ట్ (ఎస్సీ కేటగిరి), పోతుమానుగుంట సహాయకురాలు (ఓసి, ఎస్టీ) పోస్టులకు ఆసక్తిగల అభ్యర్థులను స్థానిక వివాహిత మహిళలు, పదో తరగతి ఉత్తీర్ణత సాధించి, ఈ ఏడాది జూలై ఒకటవ తేదికి 21 సంవత్సరాలు నిండి 35 సంవత్సరాలలోపు ఉండాలని, కేటాయించిన కేటగిరి సంబంధించిన వారు మాత్రమే అర్హులని తెలిపారు. దరఖాస్తులు అక్టోబర్ 1 నుండి 15 వరకు సాయంత్రం 5 గంటలలోపు దరఖాస్తులకు పదో తరగతి ఉత్తీర్ణత సర్టిఫికెట్, కుల ధ్రువీకరణ పత్రము, ఆధార్, రేషన్ కార్డు తదితర పత్రములు జతపరచాలని ఆమె తెలిపారు.

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తి ఐసిడిఎస్ ప్రాజెక్టు పరిధిలో ఖాళీగా ఉన్న అంగన్వాడీ పోస్టులకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు సిడిపిఓ శాంతి దుర్గ మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. శ్రీకాళహస్తి మండలంలో అంగన్వాడి సహాయకురాలు పోస్టులకు కేవిఎస్ తిప్ప(బీసీ-ఈ), ప్రాజెక్ట్ వీధి (బీసీ-ఈ), తొట్టంబేడు మండలంలో కొత్త కండ్రిగ-1(బీసీ-డీ), శేషమనాయుడు కండ్రిగ-1(ఓసీ) ఖాళీలున్నట్లు తెలిపారు. ఈ ఏడాది జూలై 1వ తేదీ నాటికి 21 సంవత్సరాలు నిండి 35 ఏళ్ల లోపు వయసు ఉన్న స్థానిక వివాహిత మహిళలు మాత్రమే అంగన్వాడి పోస్టులకు అర్హులని వివరించారు. ఆసక్తి ఉన్న మహిళలు ఈనెల 1వ తేదీ నుండి 15వ తేదీ లోపు దరఖాస్తులు చేసుకోవచ్చని సూచించారు.

జీఎస్టీపై అవగాహన

ప్రజాశక్తి - తిరుపతి టౌన్: జిఎస్టి 2.0 సంస్కరణల ప్రయోజనాల భాగంగా రాష్ట్రవ్యాప్తంగా జరుగుతున్న "సూపర్ జిఎస్టి - సూపర్ సేవింగ్స్" ఒక నెలపాటు ఉత్సవాలలో భాగంగా, మొదటి వారం కార్యక్రమాల కొనసాగింపులో, తిరుపతి జిల్లాలోని 6 సర్కిల్స్‌లోని కమర్షియల్ టాక్స్ శాఖ అధికారులు, జిల్లా కోఆర్డినేటర్ జీఎస్టీ ఛాంపియన్‌షిప్ శుభం బన్సల్, జెసి, తిరుపతి జిల్లా మానిటరింగ్ అధికారి జెవిఎం శర్మ, అదనపు కమిషనర్, నోడల్ అధికారి నాగేంద్ర, అదనపు కమిషనర్ ఆధ్వర్యంలో, అన్ని జిల్లా స్థాయి అధికారులు, ఎంపీడీవోలు, మునిసిపల్ కమిషనర్లు, గ్రామ సచివాలయం మరియు వార్డు సచివాలయం సిబ్బందితో సమన్వయంతో జీఎస్టీపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు.

ఆర్టీసీకి భారీ కలెక్షన్లు

డిపో మేనేజర్ రేవతి

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి: శ్రీవారి బ్రహ్మోత్సవాల సందర్భంగా శ్రీకాళహస్తి ఆర్టీసీ డిపో రికార్డు స్థాయిలో కలెక్షన్లు సాధించినట్లు డిపో మేనేజర్ రేవతి మంగళవారం పేర్కొన్నారు. సోమవారం గరుడ సేవకు రూ. 26.50 లక్షలు, మంగళవారం 32.30 లక్షల ఆదాయం ఆర్జించి శ్రీకాళహస్తి ఆర్టీసీ డిపో చరిత్రలోనే అత్యధిక కలెక్షన్లు సాధించినట్లు ఆమె వివరించారు. శ్రీకాళహస్తి-తిరుపతికి 117 పల్లె వెలుగు ట్రిప్పులు, తిరుపతి-తిరుమల మధ్య 158 ఎక్స్‌ట్రా ట్రిప్పులు తిప్పి భక్తులకు మెరుగైన సేవలందించామన్నారు. అవాంతరాలు లేకుండా ప్రయాణికులను గమ్యస్థానాలకు చేర్చిన ఆర్టీసీ సిబ్బందిని రేవతి అభినందించారు.

అమెజాన్లో పండగ ఆఫర్లు

ప్రజాశక్తి - తిరుపతి సిటీ: ప్రస్తుతం జరుగుతున్న అమెజాన్ గ్రేట్ ఇండియన్ ఫెస్టివల్ సందర్భంగా దేశవ్యాప్తంగా 270కి పైగా పట్టణాలకు అమెజాన్ ఫ్రెషన్‌ను విస్తరింపజేసి, ఉత్పత్తులను అందిస్తున్నట్లు ఆ సంస్థ డైరెక్టర్ శ్రీకాంత్ శ్రీరామ్ తెలిపారు. తాజా పండ్లు, కూరగాయలు, పప్పుదినుసులు, గృహావసర వస్తుసామాగ్రులు, స్థానికంగా ప్రజలు మెచ్చిన వస్తువులతో సహా దైనందిన అవసరాలకు కావలసిన వస్తువులను భారతదేశవ్యాప్తంగా లక్షలాది కస్టమర్లకు అందుబాటులోకి తీసుకురావటానికి అమెజాన్ నిరంతరం కృషి చేస్తుందన్నారు. కొత్తగా ఉత్తరాదిన గోరఖ్ పుర్, డెహ్రాడూన్, జాలంధర్, జిర్క్యాపూర్‌బీ దక్షిణాదిన కోయంబత్తూర్, నెల్లూరు, హస్సన్, కొడగు, వరంగల్, విజయనగరం, వెలూరు, తిరుపతి, కొట్టాయం, కోళ్ళం, హుబ్లిబీ తూర్పున జమ్షడ్పూర్, ఆసన్సోల్, ఇంకా దుర్గాపూర్ పట్టణాల్లో ఒక సేవలు విస్తరించాయి అన్నారు. అమెజాన్ ఫ్రెష్ విక్రేతలు 40,000లకు పైగా ఉత్పత్తులతో కూడిన ఒక సమగ్రమైన సెలక్షన్ ను ఆఫర్ చేస్తున్నారు. 2023లో ఆఫర్ చేసిన కేవలం 4,000 ఉత్పత్తులతో పోలిస్తే ఇది పది రెట్లు. వీటిలో, తాజా పండ్లు, కూరగాయలు, వరిధాన్యాలు, పాల ఉత్పత్తులు, ప్యాకేజ్డ్ ఫుడ్స్, ఫ్రోజెన్ ఐటమ్స్, సౌందర్య, శిశు, వ్యక్తిగత సంరక్షణ ఉత్పత్తులు, పెంపుడు జంతువులకు కావలసిన వస్తువులు, ఇంకా ఎప్పటికప్పుడు పెరుగుతున్న స్థానిక ఉత్పత్తుల పోర్ట్ ఫోలియో ఉన్నాయి. రాజధానీ గోధుమపిండి, ఈస్టర్న్ మసాలాలు మొదలుకుని జిఆర్ బి స్వీట్స్ శ్రీ భాగ్యలక్ష్మి వరిధాన్యాల వంటి 3,000లకు పైగా స్థానికంగా మెప్పు పొందిన ఉత్పత్తులతో %-% కస్టమర్లు తమ దైనందిన అవసరాలకు కావలసిన వస్తువుల కోసం షాపింగ్ చేసుకుంటూనే తమ అభిరుచులు, ప్రాధాన్యతలు, సాంప్రదాయలకు అనుగుణమైన ఉత్పత్తులను పొందే అవకాశాన్ని కల్పించామన్నారు. అమెజాన్ గ్రేట్ ఇండియన్ ఫెస్టివల్ సందర్భంగా కస్టమర్లు, కేవలం 1 రూపాయితో ప్రారంభమయ్యే డీల్స్ మొదలుకుని పండుగ ఆఫర్లను పొంది, తమ పండుగ గ్రోసరీ షాపింగు పై గరిష్ఠంగా రూ.400ల క్యాష్ బ్యాక్ తో అదనపు సొమ్మును ఆదా చేసుకోవచ్చు. లైట్లు, రంగోలీ కిట్లు, సాంప్రదాయబద్ధమైన మిఠాయిలతో సహా కొత్తగా విడుదల చేసిన దీపావళి డెకోర్ ఎసెన్షియల్లును వారు షాపింగ్ చేసుకోగలుగుతారు. ప్రతి వారాంతంలో అమెజాన్ ఫ్రెష్ సూపర్ వాల్యూ డేస్, వారపు గ్రోసరీ బాస్కెట్లు మరియు దైనందిన గృహావసర ఉత్పత్తుల పై అదనంగా సొమ్మును పొదుపు చేసుకునే అవకాశాన్ని ఆఫర్ చేస్తున్నాయి. ఈ అవకాశాన్ని వినియోగదారులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

పోషకాహారంతోనే.. మహిళలకు ఆరోగ్యం

ప్రజాశక్తి -ఏర్పేడు : స్వస్తి నారీ- సశక్త్ పరివార్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా 14వ రోజున ఆమందూరు సచివాలయంలో తల్లులకు పోషణ మా, పోషకాహారం పై అవగాహన కల్పించడం జరిగింది.అనంతరం వైద్య పరీక్షలు నిర్వహించి అవసరమగు మందులను అందించడం జరిగింది. మహిళల్లో రక్తహీనత, పిల్లల్లో పౌష్టికాహార లోపం నియంత్రించాలంటే తప్పనిసరి సంపూర్ణ ఆహారాన్ని తీసుకోవాలని పలువురు సూచించారు.ఈ కార్యక్రమంలో హెల్త్ సూపర్వైజర్ సుబ్బరాయుడు, ఏర్పేడు పీహెచ్సీ సిబ్బంది, ఆశా వర్కర్స్, అంగన్వాడీలు మరియు తల్లులు పిల్లలు పాల్గొన్నారు.

సింహ వాహనంపై శ్రీమూలస్థాన ఎల్లమ్మ విహారం

ప్రజాశక్తి - చంద్రగిరి: చంద్రగిరి గ్రామ దేవత శ్రీ మూలస్థాన ఎల్లమ్మ నవరాత్రి ఉత్సవాలలో భాగంగా ఆరవ రోజు సింహ వాహనంపై రాజరాజేశ్వరి దేవిగా భక్తులకు అభయమిచ్చారు. చంద్రగిరికి చెందిన విజయ భాస్కర్ రెడ్డి, డాక్టర్ మునిరెడ్డి, పాకాల చంద్రశేఖర్ రెడ్డి ఉభయ దాతలుగా వ్యవహరించారు. ప్రధాన అర్చకులు అరుణ సూరి సహా అర్చక బృందంతో విశేష పూజలు నిర్వహించారు. సాయంత్రం అమ్మవారు రాజరాజేశ్వరి దేవిగా భక్తులను కటాక్షించారు. ఈ కార్యక్రమంలో ఆలయ ట్రస్ట్ బోర్డ్ చైర్మన్ మొక్కల చంద్రశేఖర్ రెడ్డి, ఈవో మమత తదితరులు పాల్గొన్నారు.

అవార్డు అందుకున్న జీవిత ఖైదు యుగంధర్

ప్రజాశక్తి -ఏర్పేడు : ఏర్పేడు మండలం, జంగాలపల్లికి చెందిన యుగంధర్ కడప సెంట్రల్ జైల్లో జీవిత ఖైదు శిక్ష అనుభవిస్తూనే చదువు మీద శ్రద్ధతో, పోలీసుల సహకారంతో 4 డిగ్రీలు, 3 పీజీలు చేశారు. బిఏ పరీక్షల్లో 8.2 పాయింట్లు సాధించి రెండు తెలుగు రాష్ట్రాల్లో మొదటి స్థానంలో నిలిచాడు. ఈ నేపథ్యంలో మంగళవారం హైదరాబాదులో డాక్టర్ బిఆర్ అంబేద్కర్ దూరవిద్య యూనివర్సిటీ 26వ స్నాతకోత్సవంలో బంగారు పతకం, బుక్ ప్రైజ్ అవార్డు అందుకున్నారు.

శ్రావణ్ కుమార్‌కు పీహెచ్‌డి

ప్రజాశక్తి - తిరుపతి (మంగళం): శ్రీరామ ఇంజనీరింగ్ కళాశాల గణిత విభాగం సహాయక ప్రొఫెసర్ వాటంబేడు శ్రావణ్ కుమార్ తమిళనాడు రాష్ట్రం, చిదంబరం, అన్నామలై విశ్వవిద్యాలయం నుండి ప్రొపగేషన్ ఆఫ్ వేవ్స్ ఇన్ ట్రాన్స్వర్స్లీ ఐసోట్రోపిక్ పోరోఈలాస్టిక్ సాలిడ్స్ (ఐసోట్రోపిక్ పోరోఈలాస్టిక్ ఘనపదార్థాలలో తరంగాల ప్రసారం) అనే అత్యంత ప్రాముఖ్యత గల అంశంపై పరిశోధన చేసి పీహెచ్డి (డాక్టర్ ఆఫ్ ఫిలాసఫీ) పట్టాను సాధించారు. ఈ పరిశోధనలో డాక్టర్ కె.యలన్గోవన్, డాక్టర్ సి.నాగేశ్వర నాథ్‌లు మార్గదర్శకులుగా వ్యవహరించి, శ్రవణ్ కుమార్ పరిశోధనకు సహకరించారన్నారు. ఈ పరిశోధన భూకంప శాస్త్రం, సివిల్ ఇంజినీరింగ్, పెట్రోలియం ఇంజినీరింగ్ తదితర రంగాలలో ముఖ్యమైన అనువర్తనాలను కలిగి ఉందన్నారు. ఈ సందర్భంగా శ్రీ రామ ఇంజినీరింగ్ చైర్మన్ మన్నెం రామిరెడ్డి, సెక్రటరీ మన్నెం రామసుబ్బా రెడ్డి, డైరెక్టర్ మన్నెం అరవిందుకుమార్ రెడ్డి, ప్రిన్సిపాల్, ఫ్యాకల్టీ సభ్యులు, విద్యార్థులు శ్రవణ్ కుమార్ సాధించిన గొప్ప విజయానికి హార్థిక అభినందనలు తెలిపారన్నారు. ఈ విద్యాపర విజయం అతని శాస్త్రీయ పరిశోధనలు, ఇంజినీరింగ్ విద్య రంగంలో మరింత ముఖ్యమైన కృషికి నాంది పలుకుతుందన్నారు.

ఆర్టీసీ సర్వీసులు పునరుద్ధరించాలి

టిడిపి నాయకులు చిన్నరెడ్డిబాబు

ప్రజాశక్తి - తిరుపతి (మంగళం) : తిరుపతి-చంద్రగిరి-కరకంబాడి మీదుగా వెళ్లే ఆర్టీసీ బస్సు సర్వీసులను మంగళం బిటిఆర్ కాలనీకి మళ్లించి గతంలో లాగా సర్వీసులను పునరుద్ధరించాలని ఆర్టీసీ అధికారులను సప్తగిరి కాలనీ సీనియర్ టిడిపి నాయకులు చిన్నరెడ్డిబాబు ఓ ప్రకటనలో కోరారు. కరోనా సమయంలో నిలిపివేయబడ్డ ఈ వెలుగు బస్సు సర్వీసులను తిరిగి పునరుద్ధరిస్తే ఇక్కడి వారికి ఎంతో ఉపయోగంగా ఉంటుందన్నారు. కరకంబాడి, మంగళం ప్రాంతాలలో వివిధ ఇంజనీరింగ్ కళాశాలలో ఉండడంతో విద్యార్థులకు ఎంతో ఉపయోగమన్నారు. వందలాదిమంది మంగళం ప్రాంతం నుండి వివిధ పనుల నిమిత్తం రోజువారి ప్రయాణాలు చేస్తుంటారని, అటువంటి వారికి ఈ సర్వీసులను అందించాలన్నారు. కూటమి ప్రభుత్వం ఇచ్చిన సూపర్ సిక్స్ హామీలను భాగంగా శ్రీ శక్తి పథకం ద్వారా అమలు అవుతున్న మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం సౌకర్యం కావాలని స్థానిక ప్రజలు కోరుతున్నారన్నారు.

జీవనశైలి, ఆహారపు అలవాట్లు మారాలి

ప్రజాశక్తి - తిరుపతి టౌన్: ఆసుపత్రుల్లో కేసులు పెరుగుతుండటం, చిన్న వయసులోనే గుండె సమస్యలతో రోగులు చేరడం, జీవనశైలి కారణంగా కుటుంబాలు ఇబ్బందులు పడడం, ఇవి గుండె వ్యాధి ముప్పు ఎంత వేగంగా పెరుగుతుందో చెబుతున్నాయని, గుండె ఆరోగ్యం పట్ల నిరంతరం శ్రద్ధ తీసుకోవాల్సిన అవసరం ఉందని వాసు కార్డియో కేర్ సీనియర్ కార్డియాలజిస్ట్ డాక్టర్ పి. వాసుదేవ పేర్కొన్నారు. తిరుపతిలో నిర్వహించిన యోగా నేచురోపతి కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ ఈ కార్యక్రమంలో పాల్గొన్న 450 మందిలో వారి బరువు, రక్తపోటు, కొలెస్ట్రాల్ స్థాయిలలో గణనీయమైన మెరుగుదల కనిపించిందన్నారు. యోగా కేవలం వ్యాయామం మాత్రమే కాదు, ఇది మానసిక ఒత్తిడి తగ్గించి గుండె పనితీరును సమతుల్యం చేస్తుందన్నారు. చాలా మంది రోగులు పెద్ద సమస్య వచ్చాకే డాక్టర్లను కలుస్తారని, అప్పటికి నష్టం ఎక్కువ అయిపోతుందన్నారు. యోగా, వ్యాయామం ప్రతి రోజూ తీసుకోవాల్సిన ఔషధాల్లాంటివని చెప్పారు. అధిక రక్తపోటు, ఊబకాయం, మధుమేహం, కూర్చునే అలవాట్లు ఇవన్నీ కలిసే ఈ ప్రమాదాన్ని పెంచుతున్నాయన్నారు. ఆంధ్రప్రదేశ్‌లో ఇటీవల జరిగిన ఒక సర్వే ప్రకారం, తిరుపతిలో వృద్ధులలో మూడింట ఒక వంతు మందికి పైగా మెటబాలిక్ సిండ్రోమ్ ఉన్నట్లు బయటపడిందని, దీంట్లో అధిక బీపీ, అధిక బ్లడ్ షుగర్, పొట్ట చుట్టు కొవ్వు పెరగడం వంటి లక్షణాలు ఉన్నాయన్నారు. ఆందోళన కలిగించే విషయం ఏంటంటే ఇవన్నీ ఇప్పుడు యువతలో కూడా కనబడుతున్నాయని,తిరుపతి ఆసుపత్రుల్లో 35 ఏళ్ల వయసు నుంచే అధిక రక్తపోటు, చెడు కొలెస్ట్రాల్ కేసులు ఎక్కువగా నమోదు అవుతున్నాయన్నారు. ముఖ్యంగా మహిళల్లో ఊబకాయం, వయసు పెరిగిన తర్వాత గుండె సమస్యలకు ప్రధాన కారణమవుతోంది. అదనంగా, ఉద్యోగ ఒత్తిడి, ఆర్థిక సమస్యలు, నిద్ర లేమి ఇవన్నీ గుండెపై నిరంతర ఒత్తిడి పెంచుతున్నాయన్నారు. ఈ పరిస్థితిలో యోగా, వ్యాయామం ఎంత ముఖ్యమో వైద్య పరిశోధనలు స్పష్టంగా చెబుతున్నాయన్నారు.

రంజి, స్టేట్‌లో చోటు దక్కించుకున్న జిల్లా క్రికెట్ క్రీడాకారులు

ప్రజాశక్తి - తిరుపతి సిటీ: రంజి ట్రోఫీ ప్రాబబుల్స్ క్యాంపులో పురుషులు, స్టేట్ సీనియర్ ఉమెన్ టి20 ప్రిపరేటరీ క్యాంప్ లో మహిళలు ఉమ్మడి చిత్తూరు జిల్లా నుంచి చోటు దక్కించుకున్నారు. ఉమ్మడి చిత్తూరు జిల్లా క్రికెట్ క్రీడాకారులు అన్ని ఫార్మాట్ లలో వరుస విజయాలతో దూసుకు వెళ్తున్న జిల్లా క్రీడాకారులు ఇప్పుడు రంజి, ట్రోఫీ స్టేట్ జట్టులో కూడా తమ సత్తా చాటనున్నారు. ఆంధ్ర క్రికెట్ అసోసియేషన్ విడుదల చేసిన రంజి ట్రోఫీ 2025- 26 ప్రాబబుల్స్ క్యాంపులో జిల్లా సీనియర్ క్రికెట్ క్రీడాకారులు ఓపెనింగ్ బ్యాట్స్ మెన్స్ అభిషేక్ రెడ్డి, సి.ఆర్ జ్ఞానేశ్వర్ బౌలింగ్ లో దీపన్ సాయినాథ్ చోటు దక్కించుకున్నారు. అదేవిధంగా ఏసిఏ సీనియర్ ఉమెన్స్ టి20 రాష్ట్ర ప్రిపరేటరీ క్యాంప్ లో ఎం. గ్రీష్మ, ఈ. పద్మజ ఎంపికయ్యారు. వీరు విశాఖపట్నంలో జాతీయస్థాయిలో జరగనున్న టి20 మ్యాచ్లలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం నుంచి ఆడునున్నారు. జిల్లా క్రికెట్ క్రీడాకారులు రంజీ ట్రోఫీ, రాష్ట్ర టీ20 లకు ఎంపిక కావడం పట్ల పలువురు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఈ సందర్భంగా ఆంధ్ర క్రికెటర్ అసోసియేషన్ ఏసీఏ జాయింట్ సెక్రెటరీ విజయ్ కుమార్ (క్రికెట్ విజయ్) మాట్లాడుతూ ఉమ్మడి చిత్తూరు జిల్లా క్రికెట్ క్రీడాకారులు తమ ఉత్తమమైన ప్రతిభను కనబరుస్తూ రంజీ, రాష్ట్ర జట్టులో చోటు దక్కించుకోవడం ఆనందంగా ఉందన్నారు. రానున్న రోజుల్లో జిల్లా క్రికెట్ క్రీడాకారులు ఎపిఎల్, ఐపిఎల్ లో తప్పక చోటు దక్కించుకుంటారని ఆశాభావం వ్యక్తం చేశారు. అందుకోసం అత్యంత ఉత్తమ ప్రతిభ కనబరుస్తున్న క్రీడాకారులకు ఏసిఏ మరిన్ని సదుపాయాలు అందించనున్నదన్నదని తెలిపారు. ఇదే ఉత్సాహంతో జిల్లా క్రికెట్ క్రీడాకారులు మరింత ఉన్నత స్థాయిలో చోటు తగ్గించుకోవాలని క్రికెట్ విజయ్ కోరారు. ఈ మేరకు ఏసీఏ జాయింట్ సెక్రెటరీ విజయ్ కుమార్, చిత్తూరు జిల్లా క్రికెట్ అసోసియేషన్ అధ్యక్షులుగా శ్రీనివాసమూర్తి, సెక్రటరీగా మందపాటి సతీష్ యాదవ్, ట్రెజరర్ గా సీ.జే శివప్రసాద్, వైస్ ప్రెసిడెంట్ శ్రీధర్ కుమార్, జాయింట్ సెక్రటరీ కోలాహరి, ఎగ్జిక్యూటివ్ మెంబర్స్ గా మురళి యాదవ్, ఎస్.రవి, వెంకట్ రమణ, డి. దివాకర్, గిరి ప్రకాష్, జి. దివాకర్,రాజేంద్ర, ప్రసాద్ శర్మ, మార్కండేయులు, ప్రకాష్ నాయుడు, ఖాదర్ బాషా, పి.కే. సత్యశ్రీనివాసన్,కోచ్ లు సునీల్, చిన్నబాబు, అనిత, చంద్రిక, పలువురు సీనియర్ క్రికెట్ క్రీడాకారులు వారికి అభినందనలు తెలియజేశారు.

అంజేరమ్మను దర్శించుకున్న ఎమ్మెల్యే ఆదిమూలం

ప్రజాశక్తి - పుత్తూరు టౌన్ : దుర్గాష్టమి శుభ సందర్భంగా సత్యవేడు ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం వడమాల పేట సమీపంలో కొలువై ఉన్న అంజేరమ్మ తల్లిని మంగళవారం దర్శించుకున్నారు. ప్రత్యేక పూజలు నిర్వహించి అమ్మవారి ఆశీర్వాదాలు తీసుకున్నారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ దుర్గాష్టమి రోజున అమ్మవారిని దర్శించడం చాలా ఆనందంగా ఉందన్నారు. సత్యవేడు నియోజకవర్గ ప్రజలందరూ అమ్మవారి ఆశీస్సులతో సుఖసంతోషాలతో ఉండాలని ఆకాంక్షించారు. సీఎం చంద్రబాబు అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలు ప్రజల జీవితాల్లో వెలుగులు నింపాలని దుర్గమ్మ తల్లిని వేడుకున్నట్లు ఎమ్మెల్యే ఆదిమూలం వెల్లడించారు.

సచివాలయాల్లోనే పెన్షన్ల పంపిణీ

ప్రజాశక్తి - పుత్తూరు టౌన్ : ఏపీ గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగుల సంయుక్త చర్యా సంఘం ఆధ్వర్యంలో జరుగుతున్న ఉద్యమ కార్యక్రమంలో భాగంగా బుధవారం పంపిణీ చేయబోయే సామాజిక పెన్షన్లు సచివాలయాల పని వేళల్లోనే అందించాలనే నిర్ణయం తీసుకున్నారు. ఉదయం 10 నుండి సాయంత్రం 5.00 గంటల వరకు ఆయా సచివాలయాల వద్ద లబ్ధిదారులు తమ పెన్షన్లు పొందవచ్చని తెలిపారు. అయితే వికలాంగులు, మంచంలో ఉన్న లబ్ధిదారుల కోసం ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. వారికోసం సిబ్బంది నేరుగా వారి ఇళ్లకు వెళ్లి పెన్షన్లు అందజేయనున్నారు. ఈ విషయాన్ని ప్రతి సచివాలయ కార్యదర్శి తమ పరిధిలోని గౌరవ కౌన్సిలర్లకు, స్థానిక ప్రజాప్రతినిధులకు తెలియజేయాలని సూచించారు. అక్టోబర్ 1వ తేదీ సాయంత్రం లోపలే 100 శాతం పెన్షన్ల పంపిణీ పూర్తిచేయాలని ఏపీ గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగుల సంయుక్త చర్యా సంఘం స్పష్టంగా ఆదేశించింది.

క్రైం న్యూస్

హత్యాయత్నం కేసులో 11 మంది అరెస్ట్

■ మరో ఇరువురు కోసం గాలింపు

ప్రజాశక్తి - తిరుపతి సిటీ: హత్యయత్నం కేసులో11 మందిని అదుపులో తీసుకున్నట్లు తిరుచానూరు సిఐ సునీల్ కుమార్ తెలిపారు. స్థానిక పోలీస్ స్టేషన్లో మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ తిరుచానూరు నేతాజీ నగర్ రోడ్డులో ఈ నెల 24 న దినేష్ అనే యువకుడిపై కొందరు కత్తితో దాడి చేసిన విషయం తెలిసిందే. బాధితుడి తల్లి మునెమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామన్నారు. ఓ యువతి విషయంలో గొడవపడి కక్ష కట్టి దినేష్‌పై దాడి జరిగిందని, దాడి చేసిన వారిలో కొందరిని మేడికో ఆసుపత్రి వద్ద, మరికొందరిని నారాయణద్రి ఆసుపత్రి జంక్షన్ వద్ద మంగళవారం అదుపులోకి తీసుకున్నామన్నారు. హత్యాయత్నం కేసులో నిందితులైన అల్లం మురళీకృష్ణ, బోర్లపల్లి గుణశేఖర్, మూడే అజిత్ నాయక్, మూడే సునీల్ కుమార్ నాయక్, రాసక్క గారి మహేష్ బాబు, రాసక్క గారి సాయి తేజ, పూలపాటి చాణుక్య, నామాల అనిల్ కుమార్ రెడ్డి, ముదురు శ్రీరాములు పూర్ణచంద్, మేడూరు వినయ్, భీమవరం విష్ణువర్ధన్‌లను పోలీసులు అదుపులో ఉన్నారని, వీరుని రిమాండ్‌కు తరలిస్తున్నట్టు వెల్లడించారు. మరో ఇద్దరి కోసం గాలిస్తున్నట్టు తెలిపారు.

హై వోల్టేజ్ టవర్‌పై నుండి దూకి వ్యక్తి మృతి

ప్రజాశక్తి - రేణిగుంట: కర్ణాటక రాష్ట్రానికి చెందిన ఓ వ్యక్తి గురువరాజు పల్లి వద్ద విద్యుత్ హై వోల్టేజ్ టవర్ ఎక్కి దూకి మృతి చెందిన సంఘటన మంగళవారం చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళ్తే కర్ణాటక రాష్ట్రానికి చెందిన శివ తన మిత్రులతో కలిసి తిరుమల శ్రీవారి దర్శనాంతరం తిరుపతి రైల్వే స్టేషన్ చేరుకున్నారు. బెంగళూరు వెళ్లడానికి టికెట్లు తీసుకున్నాక మద్యం సేవించేందుకు బయటికి వెళ్లాడు. తిరిగి వచ్చేసరికి ట్రైన్ వెళ్లిపోయింది. అప్పుడు అతడు రేణిగుంట సమీపంలోని గురవరాజుపల్లి వద్ద పంట పొలాల్లో 220 కేవీ విద్యుత్ స్తంభం వద్దకు చేరుకున్నాడు. తెల్లవారుజామున సుమారు రెండు గంటల ప్రాంతంలో విద్యుత్ టవర్ ఎక్కి కూర్చొని ఉండడాన్ని చూసిన స్థానికులు రేణిగుంట పోలీసులకు సమాచారం అందించారు. సమాచారం అందుకున్న డిఎస్పి శ్రీనివాసరావు, సీఐ జయచంద్ర, ఎస్ఐ నాగరాజు సిబ్బందితో సంఘటన స్థలానికి చేరుకున్నారు. విద్యుత్, అగ్నిమాపక సిబ్బందికి సమాచారం అందించారు. విద్యుత్ సిబ్బంది టవర్‌కున్న సరఫరాను నిలిపేశారు. ఎంత ప్రయత్నించినా వీరి మాటలు అతనికి వినిపించలేదు. విద్యుత్ స్తంభం ఎక్కడానికి ప్రయత్నించగా పైనుంచి దూకే ఆనవాళ్లు కనిపించడంతో పోలీసులు వెనకడుగు వేశారు. ఒక పెద్ద వలను స్థానికులు, పోలీస్, అగ్నిమాపక సిబ్బంది పట్టుకొని ఉన్నారు. పోలీసులు ఎంత అరుస్తున్నా వినకుండా శివ టవర్‌పై నుండి కరెంటు తీగలను పట్టుకొని వేలాడుకుంటూ వచ్చి చేతులు వదలడంతో అంత ఎత్తులో నుండి వలలోకి పడడంతో తల భూమికి తగిలింది. దగ్గరుకు వెళ్లి చూసి, అపస్మారక స్థితిలో ఉన్న శివను బాలాజీ హాస్పిటల్‌కి తరలించారు. చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందాడని పోలీసులు తెలిపారు. శివకు ముగ్గురు కుమారున్నారని, వ్యవసాయం చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారని పోలీసులు విచారణలో తేలింది. ఆత్మహత్య చేసుకోవడానికి గల కారణాలు తేలాల్సి ఉంది. రేణిగుంట అర్బన్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

గంధపుచెట్టు కటింగ్ చేసిన వ్యక్తులు అరెస్టు

ప్రజాశక్తి - తిరుపతి (మంగళం): తిరుపతి నగర పరిధిలోని నగర వనంలో అటవీ క్షేత్రాధికారి సుదర్శన్ రెడ్డికి వచ్చిన రహస్య సమాచారం మేరకు తనిఖీలు చేస్తుండగా ఇద్దరు వ్యక్తులు సోమవారం గంధపు చెట్టును కటింగ్ చేస్తూ పట్టుబడ్డారు. వారిని తనిఖీ చేయగా మూడు గంధపుచెట్టు ముక్కలు, కటింగ్ సామాగ్రిని స్వాధీనం చేసుకున్నామన్నారు. మూడు గంధపు చెట్ల ముక్కల బరువు 11.40 కెజీలుగా ఉందని, వీటి విలువ మూడు లక్షల రూపాయల వరకు ఉంటుందని అంచనా వేశారు. గంధపు చెట్టును కటింగ్ చేసిన వ్యక్తులతో పాటుగా వారు వినియోగించిన ద్విచక్ర వాహనాన్ని స్వాధీనం చేసుకున్నామన్నారు. ఈ తనిఖీల్లో టిఎన్ పాలెం సెక్షన్ ఎఫ్ఎస్ఓ ఆర్ఎస్ చైతన్య, ఎఫ్‌బిఓ కిషోర్ కుమార్, ఈడిసి మంగాపురం చైర్మన్ సురేష్, ప్రొటెక్షన్ వాచర్ శివకుమార్, జంగిల్ బుక్ వాచెస్ చందు తదితరులు పాల్గొన్నారు.

ఎంపీ మిథున్ రెడ్డి బెయిల్‌పై హర్షం

ప్రజాశక్తి - పుత్తూరు టౌన్ : ఎంపీ మిథున్ రెడ్డికి బెయిల్ రావడంతో నారాయణవనం మండల కేంద్రంలోని వైసీపీ నేతలు సంబరాలు జరుపుకున్నారు. పార్టీ మండల కన్వీనర్ సొరకాయలు, రాష్ట్ర వాణిజ్య విభాగం కార్య దర్శి అన్నాదొరై, జిల్లా కార్యనిర్వాహక కార్యదర్శి రాకేష్ కిరణ్, ఆధ్వర్యంలో మిఠాయిలు పంచారు. వారు మాట్లాడుతూ మిథున్ రెడ్డి మచ్చలేని నాయకుడన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్‌లు నాగూరు, సుబ్రమణ్యంరెడ్డి, మురళి, ఎంపీటీసీ సభ్యుడు రవి పాల్గొన్నారు.

IN THE COURT OF THE XII ADDITIONAL DISTRICT JUDGE :: SRIKALAHASTI.
I.A.NO. 275 OF 2024
O.S.NO. 11 OF 2023

Between:-
K. Suseela ...Petitioner/Plaintiff
And:-
K. Gangamma and others ...Respondents/Defendants

To
Respondent No.21
Pillapalem Venkata Subba Reddy, S/o P. Ranaga Reddy, residing at Gajulamandyam Post & Village, Renigunta Mandal, Tirupathi District.
Respondent No.50
Kalavkolu Anada Naidu, S/o K. Srinivasulu Naidu, residing at Velamapalem Village, Srikalahasti Post & town, Tirupathi District

NOTICES TO RESPONDENTS NO. 21and 50

Please take Notice that the above Petitioner/ Plaintiff field the above petition **I.A.NO. 275 OF 2024 IN O.S.NO.11 OF 2023** under Section 5 of Limitation Act to condone the delay of 31 days in filing the petition under Order XXII Rule 4 of C.P.C. and the matter is posted to 17-10-2025 for your appearance either in person or through your counsel at 10.30 a.m., in the above court, in the event of your absence, the matter will be decided ex-parte.
Date of hearing: 17-10-2025.

(BY ORDER OF COURT)
G. RAJESWARA RAO,
ADVOCATE FOR PETITONER/PLAINTIFF.